

ఎల్లంపల్లి నీటి కోసం రైతుల ధర్నా

చందుర్తి(వేములవాడ): పంటలకు సాగు నీరందక ఎండిపోతున్నాయని, వెంటనే ఎల్లంపల్లి నీటిని సరఫరా చేయాలని మండంలోని నర్సింగపూర్ రైతులు శనివారం రోడ్డెక్కారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్		సహర్	
ఆది	6:32	సోమ	5:01

గరిష్ఠం/కనిష్ఠం
35.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతం అవుతుంది. జిల్లాలో తేలికపాటి జల్లులు కురుస్తాయి. ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాజన్నసేవలో ప్రముఖులు



వేములవాడ: రాష్ట్ర ఉపలోకాయుక్త జస్టిస్ నిరంజన్‌రావు కుటుంబ సమేతంగా రాజన్నను శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. స్వామి వారి దర్శనానంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ ఇన్‌చార్జి పర్యవేక్షకులు నాగుల మహేశ్ లడ్డు ప్రసాదం అందించి సత్కరించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కుటుంబ సభ్యులతో రాజన్నను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు.

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

- అదనపు కలెక్టర్ పి.గౌతమి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గౌతమి

సిరిసిల్ల: జిల్లాలోని వయోజనులకు అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని, చదువు రాని వారికి అక్షరాలు నేర్పించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.గౌతమి కోరారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో శనివారం న్యూఇండియా లిటరసీపై సమీక్షించారు. ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా అమలుచేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. 15 ఏళ్లు పైబడిన వయోజనులకు విద్యనందించడం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ ఏడాది 14,580 వయోజనులకు చదువు నేర్పించాలని సూచించారు. జెడ్పీ సీఈవో ఉమారాణి, డీఈవో రమేశ్‌కుమార్, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ముగ్గురు కౌన్సిలర్లు రాజీనామా



రాజీనామా పత్రాలు చూపుతున్న కౌన్సిలర్లు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో బీఆర్‌ఎస్ పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈమేరకు శనివారం మీడియా ఎదుట కౌన్సిలర్లు వేముల రవి, కుడిక్యాల రవికుమార్, జాగీరు శైలు, అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన తమకు బీఆర్‌ఎస్‌లో ఎలాంటి ప్రాధాన్యత లభించలేదన్నారు. మాజీ మంత్రి కేటీఆర్‌పై అభిమానంతో పార్టీలో చేరినా.. సరైన గుర్తింపు లేదన్నారు. వార్డుల్లో పెండింగ్ పనులతో ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. వీరు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది.

ఎన్నికల నోడల్ అధికారులు వీరే..

సిరిసిల్లకల్చరల్: లోక్ సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు వీలుగా వివిధ శాఖల అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. ఈమేరకు కలెక్టర్ అనురాగ్ జయంతి ఉత్తర్వులు జారీ చేశారు. నోటిఫికేషన్ నుంచి మొదలు పోలింగ్ ముగిసి ఈవీఎంలు భద్రపరిచే వరకు చేపట్టాల్సిన వివిధ రకాల ప్రత్యేక విధుల నిర్వహణకు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఎస్పీ అఖిల్ మహాజన్(శాంతి భద్రతలు), అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్(ఈవీఎంల నిర్వహణ), జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి(ఎంసీసీ), జిల్లా సబ్ ట్రెజరీ అధికారి కె.రవీందర్(ఎన్నికల వ్యయ పరిశీలన), డీడబ్ల్యూవో పి.లక్ష్మీరాజం(బ్యాలట్ పేపర్లు, పోస్టల్ బ్యాలట్లు), డీపీఆర్వో వి.శ్రీధర్(సమాచార సేకరణ), జెడ్పీ సీఈవో ఎం.ఉమారాణి(కమ్యూనికేషన్ ప్రణాళిక), ఆర్డీవో ఎల్.రమేశ్(ఎలక్ట్రోరల్ జాబితా), చేనేత జౌళిశాఖ అదనపు సంచాలకుడు ఎం.సాగర్(ఫిర్యాదులు, ఓటర్ల హెల్ప్ లైన్), గనులశాఖ సహాయ సంచాలకుడు ఎం.రఘుబాబు(ప్రొటోకాల్ ఏర్పాట్లు), డీఈవో రమేశ్‌కుమార్(మానవ వనరుల నిర్వహణ), వేములవాడ ఆర్డీవో ఎస్.రాజేశ్వర్(శిక్షణ, నిర్వహణ), వేములవాడ మున్సిపల్ కమిషనర్ జి.అన్వేశ్(ఎన్నికల సామగ్రి నిర్వహణ), జిల్లా రవాణా అధికారి వి.లక్ష్మణ్(సిబ్బంది రవాణా), జిల్లా సహాయ కార్మిక అధికారి ఎండీ రఫీ(ఈ–విజిలెన్స్), జిల్లా అదనపు డీఆర్డీవో జి.శ్రీనివాస్(స్వీప్).

కోడ్ కూసింది!



లోక్‌సభ షెడ్యూల్: నామినేషన్లు మొదలు: ఏప్రిల్ 18, చివరి తేదీ: ఏప్రిల్ 25, నామినేషన్లు పరిశీలన: ఏప్రిల్ 26
ఉపసంహరణ: ఏప్రిల్ 29, పోలింగ్ తేదీ: మే 13, ఎన్నికల ఫలితాలు: జూన్ 4

- షెడ్యూల్ విడుదలతో వేడెక్కిన రాజకీయం
- శనివారం మధ్యాహ్నం నుంచే అమల్లోకి ఎన్నికల కోడ్
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్
- మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్
- ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైన యంత్రాంగం
- ఇప్పటికే కాంగ్రెస్ మినహా బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఖరారు

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్లు

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	ఇతరులు	సర్వీస్ ఓటర్లు	మొత్తం
కరీంనగర్	1,81,093	1,81,388	43	99	3,62,623
చొప్పదండి	1,13,620	1,21,524	6	196	2,35,346
వేములవాడ	1,07,783	1,17,508	32	53	2,25,376
సిరిసిల్ల	1,19,140	1,25,967	8	106	2,45,221
మానకొండూర్	1,09,947	1,14,902	1	128	2,24,978
హుజూరాబాద్	1,21,294	1,27,967	7	164	2,49,432
హుస్నాబాద్	1,21,081	1,25,076	5	215	2,46,377

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్ల వివరాలు

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	ఇతరులు	సర్వీస్ ఓటర్లు	మొత్తం
ధర్మపురి	1,11,962	1,17,647	06	133	2,29,748
రామగుండం	1,10,255	1,09,970	26	213	2,20,464
మంథని	1,17,271	1,21,820	17	155	2,39,263
పెద్దపల్లి	1,26,404	1,29,965	07	264	2,56,640
చెన్నూరు	95,974	97,264	7	134	1,93,379
బెల్లంపల్లి	86,802	88,530	13	163	1,75,508
మంచిర్యాల	1,38,472	1,40,559	25	334	2,79,390

సాక్షిప్రతినిధి, కరీంనగర్/సాక్షి,పెద్దపల్లి: సార్వత్రిక ఎన్నికల సమరం మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం శనివారం మధ్యాహ్నం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎన్నికల ప్రవర్తనా నియమావళి) అమల్లోకి వచ్చింది. ఇక నుంచి పార్టీలు, అభ్యర్థులంతా ఎన్నికల నిబంధనలకు లోబడి వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికల నిర్వహణ, కోడ్ అమలుకు జిల్లాయంత్రాంగం అవసరమైన ఏర్పాట్లతో సిద్ధమైంది. జిల్లాలో ఇప్పటికే ఓటర్ల జాబితా విడుదల చేయగా, పోలింగ్‌కేంద్రాల గుర్తింపు పూర్తయ్యింది. అవసరమైన చోట చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. సిబ్బంది బదిలీలపై నిషేధం ఉండనుండగా, నేతలు ప్రార్థనా స్థలాల్లో ప్రచారం నిర్వహించరాదు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు చేయకూడదు.రాజకీయ పార్టీల నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగిస్తున్నారు. మద్యం, డబ్బుల పంపిణీని అరికట్టేందుకు చర్యలు ప్రారంభించారు.

79 రోజుల తరువాత తేలనున్న ఫలితం

వచ్చే నెల 18 తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే రోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఏప్రిల్ 25వరకు నామినేషన్లు స్వీకరణ, 26న పరిశీలన, 29వరకు విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం కల్పించారు. మే 13న పోలింగ్ నిర్వహించనుండగా, జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు. నేటి నుంచి పోలింగ్‌కు 62రోజుల సమయం ఉండగా, విజేతలెవరో తెలియడానికి 79రోజుల వరకు ఆగాల్సిందే. ఎన్నికల పక్రియ మొత్తం జూన్ 6తో ముగియనుంది. అప్పటి వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండనుంది. దీంతో ఇప్పటికే ఉమ్మడి జిల్లాయంత్రాంగం గోడలపై ఉన్న రాజకీయ పార్టీలకు సంబంధించిన రైటింగ్స్, ఇతర రాతలను తుడిచివేయడం ప్రారంభించారు. ఫ్లెక్సీలను తొలగించడంతో పాటు, రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగువేస్తున్నారు.

తేలాల్సింది కాంగ్రెస్ అభ్యర్థులే...

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాలకు బీజేపీ తరుపున బండి సంజయ్, గోమాస శ్రీనివాస్‌లను బరిలో నిలవనుండగా, బీఆర్‌ఎస్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్, కొప్పుల ఈశ్వర్ అభ్యర్థిత్వాలు ఖరారు అయ్యాయి. నిజామాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా ధర్మపురి అర్వింద్, బీఆర్‌ఎస్ నుంచి బాజిరెడ్డి గోవర్దన్‌రెడ్డిలు బరిలో నిలుచున్నారు. ఈ మూడు నియోజకవర్గాలకు కాంగ్రెస్ అభ్యర్థిత్వాలు ఖరారు చేయాల్సి ఉంది. కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారైతే ఎన్నికల ప్రచారం ఊపందుకోనుంది.

ప్రైవేటు వస్త్రోత్పత్తి ఆర్డర్లు సాధించాలి

- ఆసక్తి గల ఆసాములకు సూరత్‌లో శిక్షణ ఇస్తాం
- సెప్టెంబర్ నాటికి పాత బకాయిల చెల్లింపులు
- కార్మికులకు సకాలంలో సబ్సిడీలు అందిస్తాం
- చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి
- సిరిసిల్లలో కార్మిక ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి, చిత్రంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ గౌతమి

సిరిసిల్ల: నేతకార్మికులు, ఆసాములు ప్రైవేట్ వస్త్రోత్పత్తి ఆర్డర్లు సాధించాలని, మార్కెట్‌తో పోటీపడేందుకు అవసరమైన శిక్షణ, ఇతర సహాయ సహకారాలను ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందని చేనేత జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం కార్మిక సంఘాలు, ఆసాముల ప్రతినిధులతో కలెక్టర్ అనురాగ్ జయంతి సమక్షంలో సమావేశమయ్యారు. అలుగు వర్షిణి మాట్లాడుతూ వస్త్రపరిశ్రమ మనుగడకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. పూర్తిగా ప్రభుత్వంపైనే ఆధారపడటం మంచిది కాదన్నారు. ప్రైవేటు రంగంలో గల అవకాశాలను సైతం అన్వేషించాలన్నారు. ప్రభుత్వ స్థాయిలో అవకాశాలతో బట్ట తయారీ ఆర్డర్లు వస్తాయని వివరించారు. నారాయణపేట, చౌటుప్పల్ వంటి ప్రాంతాలకు చేనేత క్లస్టర్లు వస్తాయన్నారు. ఆసక్తి గల ఆసాములకు, నేతన్నల బృందాలుగా సూరత్‌లో వస్త్రపరిశ్రమ పనితీరుపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తమిళనాడు సూరత్ వంటి ప్రాంతాల్లోని టెక్నాలజీ ప్రకారం బట్టల ఆర్డర్లు సాధించే ప్రయత్నం చేయాలని సూచించారు.

టెక్నాలజీ ఉపయోగించాలి

చేనేత, పవర్‌లూమ్ రంగాల్లో వస్తున్న ఆధునిక సాంకేతికత, ప్రింటింగ్ యూనిట్, ప్రాసెసింగ్ కట్టింగ్ యూనిట్స్ ఏర్పాటు చేసుకోవాలని, బ్యాంకు రుణాలు పొందితే ప్రభుత్వ సహకారం ఉంటుందని అలుగు వర్షిణి వివరించారు. మనం తయారు చేసే వస్త్రంలో మంచి నాణ్యత ఉంటే ఆర్డర్లు వస్తాయన్నారు. వస్త్రోత్పత్తిదారులకు రావాల్సిన బకాయిలను సెప్టెంబర్ నాటికి అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్క నేతన్న, కార్మికుడు టీ నేతన్న యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ పి.గౌతమి, జౌళిశాఖ ఏడీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్క్‌లో సమావేశం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని సారంపల్లి–బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కులో యజమానులతో చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి సమావేశమయ్యారు. ఆర్వీఎం క్లాత్ ఆర్డర్ ఉత్పత్తి పురోగతిపై చర్చించారు. టెక్స్‌టైల్ పార్కులో కార్మికుల కొరత ఉందని ఆమె దృష్టికి యజమానులు తీసుకెళ్లగా.. సిరిసిల్ల నుంచి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. యజమానుల సంఘం అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అంకారపు కిరణ్, డిప్యూటీ డైరెక్టర్ అశోక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అదాలత్ తీర్పు అంతిమం

- కేసుల సత్వర పరిష్కారానికి అదాలత్
- జిల్లా జడ్జి ప్రేమలత



సిరిసిల్లలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రేమలత

సిరిసిల్లటౌన్: రాజీపడడమే మంచి నిర్ణయమని, లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పు అంతిమం అని జిల్లా జడ్జి ప్రేమలత పేర్కొన్నారు. సిరిసిల్ల కోర్టు హాలులో శనివారం నిర్వహించిన జాతీయ మెగా అదాలత్‌లో మాట్లాడారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంటున్న కేసుల సత్వర పరిష్కారమే జాతీయ లోక్ అదాలత్ లక్ష్యమన్నారు. ఇక్కడ రాజీపడితే ఒనగూరే లాభాలను వివరించాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళల హక్కుల రక్షణకు ప్రత్యేక చట్టాలున్నాయని వివరించారు. న్యాయసేవా సమితి ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

1,817 కేసులు పరిష్కారం

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉంటున్న ట్రాఫిక్ చలాన్లకు జాతీయ లోక్ అదాలత్ ద్వారా మోక్షం లభించింది. సిరిసిల్ల, వేములవాడల్లోని కోర్టు కాంప్లెక్సుల్లో జాతీయ లోక్ అదాలత్‌లో ట్రాఫిక్‌కు సంబంధించిన మొత్తం 574 చలాన్లను వాహనదారులు క్లియర్ చేసుకున్నారు. 1,807 కేసుల్లో కక్షిదారులు రాజీపడ్డారు. బ్యాంకులు, ప్రమాద బీమా కేసుల్లో రూ.92,53,080 విలువైన లావాదేవీలు పూర్తయ్యాయి. సబ్ జడ్జి రవీందర్, జూనియర్ సివిల్‌జడ్జి ప్రవీణ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి సుజన, న్యాయ సేవాసమితి సభ్యుడు చింతోజు భాస్కర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, న్యాయవాదులు పెంట శ్రీనివాస్, ఆంజనేయులు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాచమార్గం

వేములవాడ: చిన్న.. చిన్న తగాదాలతో కోర్టుల మెట్లు ఎక్కి అమూల్యమైన సమయం వృథా చేసుకోకుండా రాజీమార్గంతో అందరూ కలసికట్టుగా ఉంటే కుటుంబం, సమాజం, దేశం బాగుపడుతుందని జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా కక్షిదారులతో మాట్లాడి ఆ కేసులను కొట్టేస్తున్నట్లు ప్రకటించారు. 665 కేసులకు పరిష్కారం లభించినట్లు తెలిపారు. ఏపీపీ విక్రాంత్, ఏజీపీ గుడిసె సదానందం, మెంబర్లు నాగుల సత్యనారాయణ, నక్క దివాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు, సీనియర్ అడ్వకేట్లు నేరెళ్ల తిరుమల్‌గౌడ్, నాగుల సంపత్, పర్లపల్లి అంజయ్య, సుజీవన్, గంగరాజు, మహేశ్, సుజాత, అన్నపూర్ణ, పద్మ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- అమలులోకి ఎన్నికల కోడ్
- ఉల్లంఘన ఫిర్యాదులకు టోల్ ఫ్రీ 1950
- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో శనివారం ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిందని తెలిపారు. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, అదే రోజు నుంచి ఏప్రిల్ 25 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారని, 26 వరకు నామినేషన్ల పరిశీలన, 29 వరకు ఉపసంహరణ గడువు ఉంటుందని తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు. జిల్లాలో 4,70,634 మంది ఓటర్లు, 160 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఓటరు జాబితాలో పేరు లేని వారు ఏప్రిల్ 15 వరకు నమోదు చేసుకోవచ్చన్నారు.

ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు

మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచేలా వ్యాఖ్యలు చేయడం నిషేధమని కలెక్టర్ అనురాగ్ జయంతి స్పష్టం చేశారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై జిల్లాలో ఎంసీసీ, సర్వేలెన్స్ బృందాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్సు బృందాలను, ఎంసీఎంసీ కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిబంధనల ఉల్లంఘనలపై 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా, సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని వివరించారు. కలెక్టరేట్‌లో 24 గంటల కాల్‌సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరగకుండా చూస్తామన్నారు. ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి రవాణా చేయరాదని సూచించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీపీఆర్వో శ్రీధర్ పాల్గొన్నారు.

హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్


హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, డీజీపీ రవిగుప్త వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల కోడ్ నియమ నిబంధనలపై రాజకీయ పార్టీలకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రభుత్వ వెబ్‌సైట్లలో ముఖ్యమంత్రులు, మంత్రుల ఫొటోలు తొలగించాలన్నారు. సువిధా యాప్ ద్వారా వచ్చే దరఖాస్తులను పరిశీలించాలని, నిబంధనల ప్రకారం సకాలంలో రాజకీయ పార్టీలకు అభ్యర్థులకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో సీజ్ చేసిన డబ్బు, ఇతర ఆభరణాలు ఏడు రోజుల కంటే ఎక్కువ గ్రీవెన్స్ కమిటీ వద్ద ఉండొద్దని, సంబంధిత వ్యక్తులు ఆ నగదుకు ఆధారాలు సమర్పించకపోతే వెంటనే ఎఫ్‌ఐఆర్ బుక్ చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, గౌతమి, ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, డీఎస్పీ నాగేంద్రచారి, ఎస్బీ సీఐ అనిల్‌కుమార్ పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టరేట్‌లో నిర్వహించిన ఎన్నికల నోడల్ అధికారుల సమావేశంలోనూ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణపై దిశా నిర్దేశనం చేశారు.

మత్తు.. గమ్మత్తు.. చిత్తు!

- మత్తు బానిసలకు మార్ఫిన్ ఇంజెక్షన్లు
- ఆర్డర్‌పై నల్లమందు సరఫరా!
- కొరియర్ ద్వారా పార్సిల్స్ చేరవేత
- సైనిక్‌పురిలో తీగ లాగితే కదిలిన డొంక
- జగిత్యాల వైద్యుడు మదన్‌మోహన్ చీకటి దందా
- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న డీసీఏ దాడులు



జగిత్యాలలోని మానస ఈఎన్‌టీ ఆసుపత్రి



అక్రమంగా విక్రయిస్తున్న మార్ఫిన్ ఇంజెక్షన్లు

సాక్షిప్రతినిధి,కరీంనగర్/జగిత్యాల: 'వైద్యో నారాయణో హరి' అంటారు. ప్రాణాలు కాపాడే వైద్యుడిని కనిపించే దైవంగా కొలుస్తాం. కానీ, ప్రాణాంతక మత్తు మందును పక్కదారి పట్టిస్తూ సాక్షాత్తూ వైద్యుడే చీకటి దందాకు తెరతీసిన వైనాన్ని డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డీసీఏ) అధికారులు వెలుగులోకి తెచ్చారు. మార్ఫిన్ లాంటి నార్కోటిక్ ఇంజెక్షన్లు, మాత్రలను హైదరాబాద్‌లోని పలువురు మత్తుకు బానిసైన వారికి కొరియర్/పార్సిల్ ద్వారా అందజేస్తున్న తీరు చూసి అధికారులే విస్తుపోయారు. ఇటీవల కరీంనగర్‌లో ఎటోలార్–పి అనే నిషేధిత మాత్రలను సరఫరా చేస్తున్న గోదాంపై దాడులు చేసిన అధికారులు తాజాగా మత్తు మందులను దుర్వినియోగం చేస్తున్న తీరును బయటపెట్టారు.

ఎలా చిక్కారు?

జగిత్యాలకు చెందిన జి.మదన్‌మోహన్ మానస హాస్పిటల్‌లో ఈఎన్‌టీ వైద్యుడు. ఇతను రోగులకు మత్తు కోసం వినియోగించే మార్ఫిన్ ఇంజెక్షన్లు, మాత్రలను అక్రమమార్గంలో మత్తుకు బానిసైన వారికి విక్రయిస్తున్నాడు. ఇటీవల హైదరాబాద్ సైనిక్‌పురిలోని శ్రీ సాయిబాబా ఆఫీసర్స్ కాలనీలోని ఓ ఇంట్లో మార్ఫిన్ ఇంజెక్షన్లు, మాత్రలు ఉన్నాయన్నా సమాచారంతో డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీ), తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. ఈ తనిఖీల్లో వెర్మర్–15, రుమార్ఫ్ తదితర మార్ఫిన్ (నల్లమందుతో చేసేవి) ఇంజెక్షన్లు, మాత్రలు లభించాయి. అక్కడ తీగ లాగితే డొంక జగిత్యాలలో దొరికింది. ఈ మందులన్నీ జగిత్యాలలోని మానస ఆసుపత్రి నుంచి డాక్టర్ మదన్‌మోహన్ ద్వారా వస్తున్నాయని గుర్తించారు. ఆ ఆస్పత్రి వాచ్‌మెన్ సాయంతో హైదరాబాద్‌లోని మత్తుబానిసలకు కొరియర్ చేస్తున్నారని దర్యాప్తులో తేలింది. ఇవి జగిత్యాలలోని గొల్లపల్లి రోడ్డులోని మాన్విత ఫార్మసీకు చెందినవని కనిపెట్టారు. వాస్తవానికి నార్కోటిక్ డ్రగ్స్‌కు సంబంధించి విక్రయించేందుకు ప్రత్యేక అనుమతి ఉంటుంది. ఆయా మందుల వినియోగంపై రిజిష్టర్ కూడా నిర్వహించాల్సి ఉంటుంది. దాడుల సందర్భంగా అక్కడ నిర్వహిస్తున్న రిజిష్టర్‌లో పలు అవకతవకలున్నాయని వెల్లడించారు. దాదాపు 75 మందులు సీజ్ చేశారు. దీని తర్వాత డీసీఏ దాడులు ఉంటాయని సాక్షి ముందే వెల్లడించింది. ఈక్రమంలో శుక్రవారం డాక్టర్ మదన్‌మోహన్‌ని సైతం అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించిన విషయం తెలిసిందే.

మార్ఫిన్ ప్రాణాంతకం..

మార్ఫిన్ డ్రగ్స్ వినియోగంతో శరీరంపై దుష్ప్రభావాలు చూపిస్తుంది. శారీరక, మానసిక, భావోద్వేగ సమస్యలకు కారణమవుతుంది. ఆపరేషన్ చేసే సమయంలో నిపుణులైన వైద్యులే దీన్ని పేషెంట్‌కు ఇస్తారు. వైద్యుల సలహాతో కాకుండా వ్యక్తిగతంగా వినియోగించడం నేరం, ప్రమాదకరం. ఒక్కసారి అలవాటైతే బానిసలవుతారు. ఆ మందు కోసం దిగజారి ప్రవర్తిస్తారు. ఏమాత్రం మోతాదు పెరిగినా ప్రాణాలు పోతాయి. వైద్యులు, ఫార్మాసిస్టుల నిర్లక్ష్యంతో ఇలాంటి ప్రాణాంతక మందులు అక్రమంగా బయటకు వస్తున్నాయి. ఇలాంటి ఉదంతాలు మీ దృష్టికొస్తే 1800–599–6969న నంబరుకు సమాచారం అందించాలని డీసీఏ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. ఈ క్రమంలో సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలోనూ అక్రమాలపై డీసీఏకి వరుస ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం.

వైద్యుడి అరెస్ట్.. హైదరాబాద్ తరలింపు

ఈఎన్‌టీ ఆస్పత్రిలో ఉన్న మాన్విత ఫార్మసికి చెందిన డ్రగ్‌లైసెన్స్‌ను తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ రద్దు చేసింది. డాక్టర్‌ను కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇతడిపై 197/2024 ప్రకారం కేసు నమోదైంది. నార్కోటిక్ డ్రగ్స్ దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలుంటాయని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు.

హైదరాబాద్‌లో స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ ఇవే..

సేల్ఫేట్ ఇంజక్షన్ 50 యాంపిల్స్, మార్ఫిన్ సల్ఫేట్ 30 టాబ్లెట్స్, మార్ఫిన్ సల్ఫేట్ ఇంజక్షన్ 30 యాంపిల్స్, బుప్రెజెసిక్ ఇంజక్షన్ 25 యాంపిల్స్, డయాజెపామ్ ఇంజక్షన్ 9 యాంపిల్స్, రూమర్ఫ్ ఇంజక్షన్ 10 యాంపిల్స్, లిబ్రాక్స్ 46 టాబ్లెట్స్, బుప్రిజెసిక్ 2 ప్యాచ్‌స్, పెంటాజోసిస్ ఇంజక్షన్ 2 యాంపిల్స్, మెజోలం ఇంజక్షన్ 7 సీసాలు, ఇంజక్షన్ 25 యాంపిల్స్, నాలోక్సన్ ఇంజక్షన్ 3 యాంపిల్స్, వెర్మోర్ ఇంజక్షన్ 200 యాంపిల్స్, రూమార్ఫ్ 10 ఎంజీ 10 యాంపిల్స్, రూమార్ఫ్ 15 ఎంజీ 10 యాంపిల్స్, వెర్మోర్ 15 ఎంజీ ఇంజక్షన్ 30 యాంపిల్స్, మెజోలం 10 మి.లీ ఇంజక్షన్ 4 సీసాలు.

క్లుప్తంగా

'పది' పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్

సిరిసిల్లటౌన్: పదోతరగతి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు డీఈవో రమేశ్‌కుమార్ తెలిపారు. శనివారం మీడియాకు పది పరీక్షల వివరాలు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 35 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలకు బాలురు 3,087, బాలికలు 3,399 మొత్తంగా 6,486 మంది హాజరవుతారని తెలిపారు. వీరిలో 11 మంది ప్రైవేటు విద్యార్థులు ఉండగా.. 6,475 మంది రెగ్యులర్ విద్యార్థులు ఉన్నారని వివరించారు. ప్రతి సెంటర్‌కు ఒక చీఫ్ సూపరింటెండెంట్(సీఎస్), డిపార్టుమెంట్ ఆఫీసర్స్ 35, రూట్ ఆఫీసర్స్ 08, వెహికిల్ ఇన్‌చార్జి, సిట్టింగ్ స్క్వాడ్స్ 05, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ 02 ఉంటాయన్నారు. మొత్తంగా 372 మంది ఇన్విజిలేటర్లతో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని సెంటర్లలో పూర్తిస్థాయిలో టేబుళ్లు, డ్యుయల్ డెస్కులు, కుర్చీలు, తాగునీరు, తరగతి గదుల్లో లైటింగ్ ఫ్యాన్స్ తోపాటు బాత్‌రూమ్స్ మౌలిక వసతులు కల్పించినట్లు వెల్లడించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట ముందే సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో అనర్థాలు

వేములవాడఅర్బన్: ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో అనేక అనర్థాలు కలుగుతున్నాయని అగ్రహారంలోని ఎస్సారార్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజగోపాల్ పేర్కొన్నారు. టాస్క్ ఆధ్వర్యంలో డిప్లొమా ఫైనలియర్ విద్యార్థులకు శనివారం ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్ అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రాజగోపాల్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ వేస్ట్ ఉత్పత్తిలో చైనా, అమెరికా తర్వాత మూడో స్థానంలో భారత దేశం ఉందన్నారు. ఈ-వేస్ట్‌లో లెడ్, మెర్క్యురీ, నికెల్, కాడ్మియం వంటి విష రసాయనాలు ఉంటాయని, వాటిని జాగ్రత్తగా వేరు చేసి నిర్మూలించాలని సూచించారు. అకాల మరణాలు సైతం సంభవించే ప్రమాదం ఉంటుందన్నారు. అధ్యాపకులు శ్రీదేవి, కృష్ణమనోహర్, శాంతిసుధ పాల్గొన్నారు.

గంజాయి విక్రేత రిమాండ్

వేములవాడ అర్బన్: వేములవాడలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని స్థానిక పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సిరిసిల్లలోని రెడ్డివాడకు చెందిన గడప అఖిల్ గంజాయికి అలవాటుపడ్డాడు. ఈక్రమంలోనే డబ్బుల కోసం వేములవాడలో గంజాయి విక్రయిస్తుండగా వేములవాడటౌన్ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. రిమాండ్‌కు తరలించారు.

వెంకయ్యకుంటలో చోరీ

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని వెంకయ్యకుంటలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి నగదు, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. వెంకయ్యకుంటకు చెందిన కంకనాల మల్లవ్వ తన ఇంటికి తాళం వేసి.. కొడుకు రాజు ఇంట్లో శుక్రవారం రాత్రి నిద్రించింది. శనివారం ఉదయం మల్లవ్వ ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో వెంటనే వెళ్లి చూశాడు. బీరువా తాళాలు పగులగొట్టి రూ.86వేల నగదు, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. మల్లవ్వ ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

గురుకులం గురువులు

- చదివిన సంస్థలోనే కొలువుదీరారు
- ఉద్యోగాలు సాధించిన గిరిజన బిడ్డలు
- ఆర్థిక పరిస్థితులను జయించి.. విజయం సాధించి..
- ఆదర్శంగా నిలుస్తున్న పూర్వవిద్యార్థులు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వారంతా గిరిజన బిడ్డలు.. మారుమూల తండాల్లో పుట్టిన వారు.. ఉజ్వల భవిష్యత్ కోసం గురుకులం బాట పట్టారు. బాల్యంలో పడిన అడుగులు.. వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేశాయి. గురుకులంలో నేర్పిన క్రమశిక్షణ.. విద్య.. వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాయి. వారు చదివిన గురుకుల విద్యాసంస్థల్లోనే గురువులుగా కొలువుదీరి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గురుకులంలో చదివిన 12 మంది పూర్వవిద్యార్థులు ఇటీవల వెలువడిన గురుకుల టీజీటీ, పీజీటీ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించారు. వారి విజయగాథపై ప్రత్యేక కథనం..

తండాల నుంచి గురుకులాలకు..

రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు తండాలకు చెందిన గిరిజన బిడ్డలు ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని గురుకుల విద్యాసంస్థలో చదువుకుంటున్నారు. తండాలలో కనీస సౌకర్యాలు లేకపోవడం, ఉన్నత విద్య చదివించే ఆర్థిక స్థోమత లేని వారికి గురుకుల విద్యాసంస్థలు బాసటగా నిలుస్తున్నాయి. అక్కడ కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తున్నారు. వారంతా చిన్నతనంలోనే గురుకులంలో చేరి క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్నారు. గురుకులంలో నేర్చుకున్న వివిధ అంశాలలో మెరికల్లా తయారవుతున్నారు. కొందరు క్రీడాకారులుగా రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తుంటే.. మరికొందరు ఉన్నత విద్యతో ఇంజినీర్లు, వైద్యులు, ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయ పరీక్షలో దుమాల గురుకులంలో చదివిన పూర్వ విద్యార్థులు పలువురు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విద్యాబుద్ధులు నేర్పిన గురుకుల సంస్థలోనే గురువులుగా కొలువుదీరారు.

ఇటీవల కొలువుదీరింది వీరే..

ఇ.జ్యోతి	టీజీటీ
ఎల్.జ్యోతి	టీజీటీ
ఎం.అనిత	టీజీటీ
గుగులోతు మమత	పీజీటీ
బి.నిర్మల	పీడీ
గుగులోతులత	లైబ్రేరియన్
బి.వినోద	పీజీటీ
ఎల్.రజిత	టీజీటీ
జి.కవిత	జూనియర్ అసిస్టెంట్
కె.లలిత	నర్సింగ్ ఆఫీసర్
మాలోతు అనిత	నర్సింగ్ ఆఫీసర్

గర్వంగా ఉంది



మా విద్యాసంస్థలో చదివిన పూర్వ విద్యార్థులు గురుకుల ఉపాధ్యాయులుగా ఎంపికవడం గర్వంగా ఉంది. వీరి విజయం తర్వాత వచ్చే విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.

– రామారావు, ప్రిన్సిపాల్, దుమాల గురుకులం

అవకాశాలను సద్వినియోగం చేసుకొని..



అవకాశాలను సద్వినియోగం చేసుకున్నాను. గురుకులంలో అన్ని సౌకర్యాలతో ఉన్నత విద్యనభ్యసించి.. నేడు టీజీటీగా ఎంపికవడం అదృష్టంగా భావిస్తున్న. గురుకులంలో చదువుకున్న పాఠాలే జీవిత పాఠాలుగా మారాయి.

– లకావత్ అనిత, గుండారం

ఆర్థిక పరిస్థితులు వెంటాడినా..



మాది మారుమూల గిరిజన గ్రామం వస్‌పల్లి. మా తండాకు కనీసం బస్సు సౌకర్యం కూడా ఉండేది కాదు. నన్ను చదివించే ఆర్థిక స్థోమత కూడా ఆ సమయంలో మా తల్లిదండ్రులకు లేదు. అయినా గురుకులంలో చదువుకొని ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది.

– భూక్య నిర్మల, వస్‌పల్లి

కష్టపడితే ఫలితం..



గురుకులం విద్యాసంస్థలో చదువుకొని అందులోనే రెండు ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉంది. కష్టపడితే ప్రతీ ఒక్కరికి మంచి భవిష్యత్ ఉంటుంది. పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు సాధించి నా తల్లిదండ్రుల కల నెరవేర్చా.

– గుగులోతు మమత, బావుసాయిపేట

తల్లిదండ్రుల కల సాకారమైంది



నా తల్లిదండ్రులు నన్ను ఉన్నతంగా చూడాలని చిన్నప్పుడే గురుకుల విద్యాసంస్థలో చేర్పించారు. అక్కడ నేర్పిన క్రమశిక్షణతోనే నేను ఈ రోజు టీజీటీగా ఎంపికయ్యాను. ఇది నాకు చాలా గర్వంగా ఉంది.

– ఇస్లావత్ జ్యోతి, నిమ్మపల్లి

సంతోషంగా ఉంది



గురుకులంలో చదవి.. అదే సంస్థలో టీచర్‌గా సెలెక్ట్ కావడం చాలా సంతోషంగా ఉంది. టీచర్ పోస్టు కోసం పోటీ బాగా ఉన్నప్పటికీ ఉద్యోగం సాధించడం గర్వంగా ఉంది. మా తల్లిదండ్రుల కలను నెరవేర్చాను.

– లావుడ్య జ్యోతి

జీవిత కల నెరవేరింది



చిన్నప్పటి నుంచి టీచర్ కావాలనే నా జీవిత కలనెరవేరింది. మా గురుకులంలో గురువులు నేర్పిన పాఠాలు నాకు మార్గదర్శకంగా నిలిచాయి. నేను గురుకులానికి ఎంతో రుణపడి ఉంటాను.

– భూక్య వినోద

నా జీవితానికి మార్గదర్శి



మాది హుస్నాబాద్ ప్రాంతంలోని బాలునాయక్‌తండా. మా ఊరి నుంచి దుమాలలోని గురుకులానికి వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడ్డ. గురుకులం నుంచి వచ్చి పోయేందుకు ఒక్క రోజు పట్టేది. నేడు టీచర్‌గా ఉద్యోగం సాధించా. నా జీవితానికి మార్గదర్శి మా గురుకులం.

– గుగులోతు లత, బాలునాయక్‌తండా

ఆ రెండు పార్టీలవి చీకటి ఒప్పందాలు

- బీజేపీకి అవినీతిలో భాగస్వామ్యం
- కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్‌కు ఏటీఎం
- కేసీఆర్‌పై ఆరోపణలే తప్ప చేతల్లేవు
- లిక్కర్ గేమ్‌లో కవిత అరెస్టు హైడ్రామే..
- కాంగ్రెస్ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి



ప్రెస్‌మీట్లో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో ఆ రెండు పార్టీలు చీకటి ఒప్పందాలతో రాజకీయం చేస్తున్నాయని బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఉద్దేశించి కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్లలోని ఆయన ఆఫీస్‌లో శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్లో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ చేసిన లక్షలాది కోట్ల అవినీతిలో బీజేపీకి భాగస్వామ్యం ఉందని ఆరోపించారు. ప్రధాని మొదలుకుని బండి సంజయ్‌వరకు కాళేశ్వరంలో అవినీతి జరిగిందని ఆరోపించారే తప్ప ఏనాడూ కేసీఆర్‌పై చర్యలు తీసుకోలేదన్నారు. గత పదేళ్లుగా కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్‌కు ఏటీఎంగా పనిచేసిందన్నారు. ప్రజాస్వామ్యం గురించి కేటీఆర్ మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను చూసి బీజేపీ, బీఆర్‌ఎస్‌లు మరో హైడ్రామాకు తెరలేపాయన్నారు. ఈక్రమంలోనే లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారని ఆరోపించారు. గడ్డం నర్సయ్య, యెల్ల లక్ష్మీనారాయణ, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, గంభీరావుపేట ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా ఉంటేనే వేధింపులు ఉండవు

- ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్ల: ధైర్యంగా ఉంటేనే వేధింపులు ఉండవని, ఎలాంటి సమస్యలు ఎదురైనా ముందుగా తల్లిదండ్రులకు చెప్పాలని, పోకిరీలతో ఇబ్బందులు ఏర్పడితే ఫిర్యాదు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. జిల్లా కేంద్రంలోని నర్సింగ్ కాలేజీలో శనివారం షీటీం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. జిల్లాలో మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటుచేసిన షీటీం బృందం విద్యాసంస్థలు, బస్టాండ్లు, మహిళలు పనిచేసే ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీలో ఉంటూ పోకిరీలపై నిఘా పెడతారని తెలిపారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని కోరారు. ఎవరైనా వేధిస్తే వెంటనే 100, జిల్లా షీటీం 87126 56425లో ఫిర్యాదు చేయాలని కోరారు.

మాదకద్రవ్యాలు అరికట్టాలి

మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా పోలీస్‌శాఖ పనిచేస్తుందన్నారు. జిల్లాలో విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో యాంటీ డ్రగ్ క్లబ్స్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి, షీటీం ఏఎస్సై ప్రమీల, ప్రియాంక, రమాదేవి, శ్రీధర్, భరోసా సెంటర్ సిబ్బంది, కళాశాల, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

సెల్‌ఫోన్ చోరీ

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణంలోని ఓ సెల్‌ఫోన్ షాపులో సినీఫక్కీలో చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలోని ఓ సెల్‌ఫోన్ షాపునకు శనివారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు వచ్చారు. ఒకరు షాపులోకి రాగా.. మరొకరు టూవీలర్‌పై బయటే ఉన్నాడు. షాపులోకి వచ్చిన వ్యక్తి ఐఫోన్ చూపించమని అడుగగా.. షాపు యజమాని చూపిస్తూ.. మరో కస్టమర్‌తో మాట్లాడుతున్నాడు. ఇదే అనువుగా భావించిన సదరు యువకుడు రూ.70వేల విలువైన ఫోన్‌తో బయటకు వచ్చి తనకోసం వేచి ఉన్న వ్యక్తితో బైక్‌పై వెళ్లిపోయాడు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేయగా..దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయాల్లోకి రావాలి..

సిరిసిల్లటౌన్: గత ప్రభుత్వం హయాంలో అధికార పార్టీ నాయకులు జిల్లా వ్యాప్తంగా వనరులు కొల్లగొడుతూ..అక్రమ సంపాదన ఆర్జించారని టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ బుర్ర రవితేజగౌడ్ ఆరోపించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. జిల్లా నుంచి పెద్ద ఎత్తున వాహనాల్లో ఇసుకను ప్రతిరోజు ఇతర ప్రాంతాలకు తరలించారన్నారు. అక్రమ మైనింగ్ అరికట్టేందుకు యువత రాజకీయాల్లోకి రావాలని కోరారు. గత పదేళ్లుగా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక అక్రమ కేసులు బనాయించిందన్నారు. వారికి ఉచితంగా న్యాయసేవలు అందిస్తామని తెలిపారు. విశాల్, నరేశ్, వివేక్ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులను ఆదుకుంటాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట(వేములవాడ): గల్ఫ్ కార్మికులను ఆదుకునేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన బొడ్డు బాబు మూడు నెలల క్రితం బహ్రెయిన్‌లో మృతి చెందాడు. వారి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును శనివారం ఆది శ్రీనివాస్ అందజేసి మాట్లాడారు. మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు రాష్ట్రంలోనే గల్ఫ్ బాధితులకు మొదటి చెక్కును అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో 2 వేల మంది గల్ఫ్ కార్మికులు మరణించినా వారి కుటుంబాలను పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నారై విభాగం ఇంటర్నేషనల్ కన్వీనర్ మంద భీంరెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, ఎంపీటీసీ యాస్మిన్ పాషా, నాయకులు బైరగోని నందుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వికల్పలో మెరిసిన వికాస్ విద్యార్థులు



సిరిసిల్లటౌన్: శాతవాహన యూనివర్సిటీ నిర్వహించిన కామర్స్ మీట్ 'వికల్ప'లో సిరిసిల్ల వికాస్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు రాణించా రు. యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొనగా.. వికాస్ కళాశాల విద్యార్థులు ఉన్నత ర్యాంకులు సాధించారు. ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ బహుమతులు గెల్చుకున్న విద్యార్థులు ఎ.విద్య, బి.పల్లవి, ఎం.సంతోష్, వి.సాయిగణేష్, జి.నవ్య, డి.హారికలను యాజమాన్యం గుగ్గిళ్ల జగన్‌గౌడ్, దిడ్డి శ్రీనివాస్‌లు అభినందించారు.

నేరాల నియంత్రణకు కార్డన్‌సెర్చ్

- వన్యప్రాణులను వేటాడితే పీడీయాక్టు
- వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి



చందుర్తి(వేములవాడ): నేరాల నియంత్రణకు నిర్బంధ తనిఖీలు నిర్వహిస్తున్నామని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి పేర్కొన్నారు. చందుర్తి మండలం రామన్నపేటలో శనివారం తెల్లవారుజామున వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. కాగితాలు సక్రమంగా లేని 28 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడారు. విద్యుత్ తీగలు అమర్చి వన్యప్రాణులను వధిస్తే పీడీయాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అపరిచితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వేములవాడరూరల్ సీఐ శ్రీనివాస్, చందుర్తి, రుద్రంగి, బోయినపల్లి ఎస్సైలు సీహెచ్ శ్రీకాంత్, అశోక్, పృథ్వీధర్ పాల్గొన్నారు.

వడగండ్ల వాన.. రైతుల ఆందోళన



గంభీరావుపేటలో దెబ్బతిన్న వరిపంట



సిరిసిల్లలో కురుస్తున్న వర్షం

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి/ముస్తాబాద్/గంభీరావుపేట/రుద్రంగి: జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానతో వరిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మామిడి పూత రాలిపోగా, ఇప్పటికే కాసిన కాత సైతం నేలవాలింది. పలు గ్రామాల్లో రాత్రి వేళ కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్, అల్మాస్‌పూర్, గుంటపల్లిచెరువుతండా, బుగ్గరాజేశ్వరతండా, అక్కపల్లిలో పంటలకు నష్టం జరిగింది. గంభీరావుపేట మండలంలో రాళ్లవాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులు, రాళ్లతో కూడిన వర్షం కురిసింది. దీంతో పొట్టదశలో ఉన్న, కోతకు వచ్చిన వరిచేలు దెబ్బతిన్నాయి. మండలకేంద్రంతోపాటు దమ్మన్నపేట, నాగంపేట, జగదాంబతండా, గోరింటాల, లింగన్నపేట, నర్మాల గ్రామాల్లో రాళ్లవాన కురిసింది. చెట్లు, విద్యుత్‌స్తంభాలు విరిగిపడ్డాయి. వీర్నపల్లి మండలంలోని వస్‌పల్లి, గర్జనపల్లి, అడవిపదిర, రంగంపేట గ్రామాల్లో వడగండ్ల వానతో వరి పంటకు నష్టం జరిగింది. ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు పోతుగల్, గూడెం, ఆవునూర్, నామాపూర్ గ్రామాల్లో వడగండ్లు కురిశాయి. రుద్రంగిలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారి వెంట గల దుకాణాల్లోకి వరద నీరు చేరింది. కొత్తగా నిర్మించిన రోడ్డు ఎత్తుగా ఉండడంతో సమస్య ఏర్పడింది. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.15వేలు పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు.

భారీ పేలుడు సామగ్రి స్వాధీనం

- 1,392 జిలెటెన్ స్టిక్స్, 897 డిటోనేటర్లు, 196 ఫ్యూజ్‌లు సీజ్



పేలుడు పదార్థాల బాక్సులు పరిశీలిస్తున్న ట్రెయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలో అక్రమంగా నిలువ చేసిన పేలుడు పదార్థాలను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ట్రెయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి 1,392 జిలెటెన్ స్టిక్స్, 897 డిటోనేటర్లు, 196 ఫ్యూజ్‌లను సీజ్ చేశారు. ట్రె యినీ ఎస్పీ రాహుల్ రెడ్డి తెలిపిన వివరాలు. తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లెకు చెందిన మిరాల భాస్కర్ జిల్లెల్ల గ్రామ శివారులో శాంభవి స్టోన్ క్రషర్‌లో భాగస్వామి. నాలుగు నెలల క్రితంఅనుమతులు లేకుండా 83ఎంఎం 87 జిలిటెన్ స్టిక్స్, 25ఎంఎం 249 జిలెటిన్ స్టిక్స్, 10 మీటర్ల రెడ్‌వైర్ కొని క్రషర్ ప్రాంతంలో దాచిపెట్టాడు. అతనితోపాటు ఓబులాపూర్‌కు చెందిన చేమంతి స్టోన్ క్రషర్ యజమానులు మడుకు శ్రీకాంత్‌రెడ్డి, కాసారం సాగర్‌బాబు అనుమతులు లేకుండా అక్రమంగా 25ఎంఎం 1,056 జిలెటిన్ స్టిక్స్, 897 డిటోనేటర్లు, 196 ఫ్యూజులు నిల్వ ఉంచారు. విశ్వసనీయ సమాచారంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన పోలీసులు పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి



సిరిసిల్లలో బీఆర్‌ఎస్ నాయకుల ధర్నా

సిరిసిల్ల: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌పై సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ నిరసన తెలిపింది. కేంద్ర ప్రభుత్వం బీఆర్‌ఎస్‌పై కక్ష గట్టి ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్ట్ చేశారని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ ఆరోపించారు. ఒక ఆడబిడ్డ అని కూడా చూడకుండా అక్రమ కేసులు పెట్టారన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ ఈడీ, మోదీ కలిసి కేసీఆర్‌ను దెబ్బతీయాలనే కవితను అరెస్ట్ చేశారన్నారు. ఉద్యమ పార్టీగా బీఆర్‌ఎస్‌ను బీజేపీ ఏమీ చేయలేదన్నారు. బీజేపీ ప్రభుత్వానికి, మోదీకి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ ఎత్తున నినాదాలు చేశారు. అంబేద్కర్ సర్కిల్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, ఎంపీపీలు పిల్లి రేణుక, పడిగెల మానస, వంగ కరుణ, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గూడూరి ప్రవీణ్, కల్వకుంట్ల గోపాల్‌రావు, సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మాజీ ఏఎంసీ చైర్మన్లు పూసపల్లి సరస్వతి, అక్కరాజు శ్రీనివాస్, పార్టీ నాయకులు గజభీంకార్ రాజన్న, అగ్గిరాములు, మనోజ్, మల్లారెడ్డి, మధు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ దహనంతో అంటుకున్న మంటలు

ప్రధాని మోదీ ఫ్లెక్సీని కాలబెట్టేందుకు పెట్రోల్ చల్లి నిప్పు పెట్టే క్రమంలో ఒక్కసారి మంట వెనక్కిరావడంతో కోడం సాయి(30) ప్యాంటు అంటుకుంది. వెంటనే బీఆర్‌ఎస్ నాయకులు స్పందించి ప్యాంట్‌ను విప్పివేసి, జిల్లా ఆస్పత్రికి తరలించారు. మరోవైపు ఇదే నిరసనలో పాల్గొన్న ఎల్లారెడ్డిపేట ఎంపీపీ పిల్లి రేణుక, తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస పరస్పరం దూషించుకున్నారు.